క్లుప్తంగా

సన్మానం



నర్సంపేట : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గంట రవికుమార్‌ను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సోమవారం గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. రవికుమార్ ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపునే రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని తెలిపారు. రవి కుమార్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

వర్ధన్నపేట : బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌ను వర్ధన్నపేటకు చెందిన ఆ పార్టీ నాయకులు కలిసి అభినందించారు. తొలుత పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం భూపాల్, జడ సతీశ్, కుందూరు మహేందర్‌రెడ్డి, పంజా వెంకటేశ్వర్లు, బర్ల నవీన్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

7 ఎంపీటీసీ స్థానాలతో జాబితా విడుదల

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మొత్తం 19 గ్రామ పంచాయతీలకు గాను 7 ఎంపీటీసీ స్థానాలతో అధికారులు తుది జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. భాంజీపేట, చంద్రయ్యపల్లి, కమ్మపల్లి, ఇటుకాలపల్లి, లక్నెపల్లి, రాజుపేట, గురిజాల ఎంపీటీసీ స్థానాలుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. మండల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఇద్దరు విలేకరులపై కేసు

పర్వతగిరి : మండలానికి చెందిన ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన దుంపల వేణు పొక్లెయిన్‌తో రైతుల పొలాల్లో బండ రాళ్లను తొలగిస్తూ, ఇతర పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో మట్టి దందా చేస్తున్నావంటూ వెలుగు పత్రిక విలేకరిగా పని చేస్తున్న మండల కేంద్రానికి చెందిన దొడ్డ శ్రీనివాస్, నవతెలంగాణ విలేకరిగా పని చేస్తున్న చింతనెక్కొండకు చెందిన బోనాల సాంబయ్య బెదిరింపులకు పాల్పడ్డారు. శ్రీనివాస్, సాంబయ్య వేధింపులు తాళలేక వేణు పలుమార్లు డబ్బు ముట్టజెప్పాడు. అయినా శ్రీనివాస్, సాంబయ్య ఇంకా డబ్బు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నట్టు బాధితుడు వేణు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

ఏజెన్సీలో అక్రమ నిర్మాణాలపై చర్యలు



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేట ఏజెన్సీ గ్రామంలో సరైన ప్రభుత్వ అనుమతి లేకుండా ఇళ్ల, ఇతర నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఎంపీఓ రామ్మోహన్ స్పష్టం చేశారు. రాజుపేట శివారులోని నర్సంపేట–మల్లంపల్లి రహదారి పక్కన ఇంటి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులకు సోమవారం ఆయన నోటీసులు అందజేసి మాట్లాడారు. రాజుపేటలో ఇంటి, ఇతర నిర్మాణాలు చేపట్టాలంటే పీసా చట్టానికి లోబడి చేయాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామంలో ఏజెన్సీ పరిధిలోకి వస్తుందని, గ్రామ పరిధిలో పీసా చట్టం నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల బైండోవర్

గీసుకొండ : వాట్సాప్ గ్రూపుల్లో పరస్పర ఆరోపణలు చేసుకుంటూ వివాదాస్పద పోస్టులు పెట్టిన క్రమంలో సంబంధిత కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు తహసీల్దార్ ఎదుట సోమవారం బైండోవర్ చేసినట్టు సీఐ మహేందర్ తెలిపారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిపై కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులపై బీఆర్‌ఎస్ నాయకులు ఇటీవల పరస్పరం వివాదాస్పదమైన పోస్టులు పెటారని సీఐ చెప్పారు. సదరు పోస్టులు వైరల్ కావడంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఇరు పార్టీల వారిని బైండోవర్ చేసినట్టు సీఐ వివరించారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన రత్నాకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి రత్నాకర్‌తో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం రూ.50 వేల సాయం అందజేశారు. తొలుత రత్నాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వేతనాలందక పారిశుద్ధ్య సిబ్బంది వెతలు

- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..!

నర్సంపేట రూరల్ : నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలందక వెతలు తప్పడం లేదు. అసలే చాలీచాలనీ జీతాలతో కాలం వెళ్లదీస్తున్న తాము కుటుంబాలతో పస్తులుంటున్నామని కార్మికులు వాపోయారు. మొదటి ఒకటి, రెండు నెలలు అప్పు చేసి కుటుంబాలను పోషించుకున్నా తదనంతరం ఎక్కడా అప్పు సైతం పుట్టడం లేదని పలువురు తెలిపారు. ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతోనే చెల్లించడం లేదని కాంట్రాక్టర్ చేతులెత్తేయడం గమనార్హం.

నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉన్నప్పుడు శ్రీసాయి మ్యాన్ పవర్ ఏజెన్సీ ఆధ్వర్యంలో 41 మంది పారిశుద్ధ్య సిబ్బంది సేవలు అందించారు. ఇందులో 9 మంది చొప్పున సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో, ముగ్గురు సూపర్‌వైజర్లు, 20 మంది స్వీపర్లుగా విధులు నిర్వర్తించారు. ఆ కంపెనీ ప్రభుత్వం నిధుల మంజూరీలో జాప్యం చేసినా కార్మికులకు మూడు నెలలు వేతనాలు ఇచ్చిన పరిస్థితి తెలిసిందే. కాగా ప్రస్తుత కాంట్రాక్టర్ రెండు నెలల జీతం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కార్మికులందరూ పేద కుటుంబాలకు చెందిన వారే కావడంతో వారి వేదన వర్ణనాతీతంగా మారింది. ప్రభుత్వం నుంచి 7 నెలల జీతాలు



నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి

రావాల్సి ఉందని, తాను సైతం సర్దుబాటు చేయలేక సతమతమవుతున్నట్టు కాంట్రాక్టర్ చెప్పినట్టు తెలిసింది. దిక్కుతోచని స్థితిలో కార్మికులు వేదనకు గురవుతున్నారు. నామమాత్రపు వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నామని, ఆమాత్రం కూడా సకాలంలో ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము ఆస్పత్రిలో సేవలు అందించలేమని పలువురు తెలిపారు. పనులు బంద్ చేసి ఆందోళన చేపడతామని కార్మికులు చెబుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించి వేతన సమస్యను సత్వరమే పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.

బేసిక్ 15 వేల 600.. చేతికొచ్చేది రూ.11 వేలే..

ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులుగా 41 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరికి బేసిక్ పే రూ.15 వేల 600గా ప్రభుత్వం నిర్ణయించింది. పీఎఫ్, ఈఎస్ఐ, కాంట్రాక్టర్ కమీషన్ పోగా కార్మికులకు రూ.12 వేల 94 చొప్పున అందాల్సి ఉండగా కాంట్రాక్టర్ కేవలం రూ.11 వేలు ఇస్తుండడంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వేతనంలో ఈఎస్ఐ, పీఎఫ్ కోత పెడుతున్న విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



కార్మికుల వేతన సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. ఐదు నెలలుగా వేతనాలు అందడం లేదని తెలిసింది. ఈ విషయమై ఏజెన్సీ నిర్వాహకులతో, ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలోనే వేతన బకాయిలు చెల్లించే దిశగా చొరవ తీసుకుంటాం. ప్రభుత్వం డబ్బులు చెల్లించేలా ప్రయత్నిస్తాం. ప్రభుత్వం డబ్బులు అందిస్తేనే కార్మికుల ఇబ్బందులు తొలగుతాయి.

– డాక్టర్ కిషన్, ఆస్పత్రి సూపరింటెండెంట్

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



వర్ధన్నపేట : అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వెలిబుచ్చారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు జిల్లావ్యాప్తంగా సోమవారం నిరసనలు తెలిపారు. జిల్లాలోని వర్ధన్నపేట, గీసుకొండ, నెక్కొండ, పర్వతగిరి, రాయపర్తి, సంగెం మండలాల్లో ఆ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. నెక్కొండలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేయగా పర్వతగిరిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గాదె దయాకర్, పార్టీ జిల్లా, నియోజకవర్గ అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేశ్, చాడ కొమురారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి



నెక్కొండ : అంబేడ్కర్ సెంటర్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, తదితరులు మాట్లాడారు. బడ్జెట్‌లో తెలంగాణకు తక్కువగా నిధులు కేటాయించారని, వివక్ష పాటించారని ఆరోపించారు.

భూకబ్జా ఆరోపణలు సరికాదు

- ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి ప్రణయ్‌దీప్

దుగ్గొండి : దళిత సామాజికవర్గానికి చెందిన చిరు ఉద్యోగిపై భూకబ్జా ఆరోపణలు సరికాదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. మండలంలోని గిర్నిబావికి చెందిన అక్కెల్లి స్వామి ఆరోపణలు ఎదుర్కొంటుండగా ఆయన ఇంటి నిర్మాణ స్థలాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నిజనిర్ధారణ కమిటీ సోమవారం సందర్శించింది. అనంతరం ప్రణయ్‌దీప్ మాట్లాడారు. స్వామి విద్యుత్‌శాఖలో చిరు ఉద్యోగిగా పని చేస్తూ డబ్బు కూడపెట్టుకుని ఐదేళ్ల క్రితం భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపారు. స్వామి రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపట్టగా పక్కనే ఉన్న అగ్రవర్ణ సంపన్నులు పలుకుబడితో అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని చెప్పారు. అద్దె పూలే గురుకుల విద్యాలయ



భూమిని పరిశీలిస్తున్న ప్రణయ్‌దీప్, నాయకులు

భూమిని అక్రమించారని, కబ్జారాయుడని ఆరోపణలు చేయడం తగదన్నారు. స్వామిపై ఆరోపణలు చేసిన వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మామునూరి శ్రీధర్, కొలగాని రవి, వసంత్, గోవర్ధన్, రమేశ్, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఆ పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొందరు రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందన్నారు. సుమారు రూ.42 వేల కోట్ల రుణమాఫీ చేయాల్సి ఉండగా రూ.18 వేల కోట్లు మాత్రమే అందించి దులుపుకుందని ధ్వజమెత్తారు. వెంటనే ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి రుణమాఫీకి దూరమైన అర్హులను గుర్తించే ప్రక్రియ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, నాయకులు కోమండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, కందుల రాజిరెడ్డి, లకిడే రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పెసరు గంగాధర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత గంగాధర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, ఇంగోళి రాజేశ్వర్‌రావు, పొగాకు వెంకటేశ్వర్లు, హింగే రామారావు తదితరులున్నారు.

సరుకుల అందజేత

రాయపర్తి : మండలంలోని పన్యానాయక్‌తండాలో చెడుపాక దయాకర్, శివరామపురంలో మాలోతు సాలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ సమకూర్చిన బియ్యం, నూనె, తదితర సరుకులను బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూల మధు చేతుల మీదుగా ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేవారు. అనంతరం మైలారంలో ఎల్లమ్మ పండుగ చేసుకున్న గబ్బెట యాకయ్యకు బియ్యం, ఆయిల్‌క్యాన్ అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో బాధిత, పేద కుటుంబాలకు సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, వెంకట్రాం, నాగపురి సోమయ్య, వీరన్ననాయక్, గజవెల్లి ప్రసాద్, కోల సంపత్, సంకినేని ఎల్లస్వామి, భూక్య రవి, వసంత, శ్రీనివాస్, నూనావత్ శంకర్, ఆంగోత్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



రాయపర్తి : మండలంలోని జింకురాంతండాలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గుగులోతు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జన్మదిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు తొలుత మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చేత కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విద్యార్థులకు అందించాలంటూ శ్రేణులకు నోట్‌బుక్కులు, పెన్నులు అందజేశారు. అనంతరం జింకురాంతండాలో కేక్ కట్ చేసి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు నాగేశ్వర్‌రావు, ఉల్లెంగుల యాదగిరి, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, పెండ్లి మహేందర్‌రెడ్డి, వెంకన్న నాయక్, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపల్లి కమిటీ ఆధ్వర్యంలో..




రాయపర్తి : మండలంలోని జగన్నాథపల్లి కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో అన్నదానం చేశారు. బాలల చేత కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్, మాజీ వార్డు సభ్యుడు గుగులోతు మంగులాల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందుకూరి కృష్ణ, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



నర్సంపేట : స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ 3 దశాబ్దాలుగా సామాజిక సేవలు నిర్వహిస్తుండడం అభినందనీయమని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ వీరీస్ అన్నారు. సుదర్శన్ జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ కిషన్‌తో కలిసి ఆర్‌ఎంఓ వీరీస్ సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. సుదర్శన్ విద్య, వైద్యం, రైతు, మహిళా సంఘాలను చైతన్యవంతం చేస్తూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం సంజీవని అనాథాశ్రమంలోని విద్యార్థులకు ఆశ్రమ నిర్వాహకుడు డాక్టర్ మోహన్‌రావు వినోదతో కలిసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, జిల్లా వినియోగదారుల విజిలెన్స్ కమిటీ మెంబర్ నాగెల్లి సారంగం, పీడీ నాడెం సాంబయ్య, ప్రమోద్, వెంకట్రాం నర్సయ్య, నైపుణ్య శిక్షకురాలు నాడెం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'లక్ష గొంతుకలు..' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఖానాపురం : హైదరాబాద్‌లో ఈనెల 7న నిర్వహించనున్న 'లక్షల గొంతుకలు.. వేల డప్పులు' కార్యక్రమ సాంస్కృతిక మహా ప్రదర్శన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్, రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఉద్యమాలు కొనసాగిస్తున్నట్టు తెలిపారు. మహాప్రదర్శనకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాదిగ ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెరిపోతుల వెంకటేశ్వర్లు, నాయకులు నేలమారి నాగరాజు, రవి, సోమయ్య, కడారి రవి, నర్సయ్య, సోమయ్య, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు సాయి శాస్త్రి



ఘనంగా వసంత పంచమి



నర్సంపేటలో..



గీసుకొండ : ఎలుకుర్తిలో..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, నెక్కొండ, చెన్నారావుపేట, గీసుకొండ మండలాల్లో సోమవారం ఘనంగా వసంత పంచమి నిర్వహించారు. నర్సంపేటలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, అక్షర పాఠశాలలో చిన్నారులతో చైర్మన్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వనజ అక్షరాభ్యాసం చేయించారు. నెక్కొండలోని శ్రీరామలింగేశ్వరాలయంలో అర్చకుడు బీవీఎస్.శాస్త్రి, చెన్నారావుపేటలోని సిద్ధేశ్వరాలయంలో అర్చకుడు సాయి శాస్త్రి, గీసుకొండ మండలంలోని ఎలుకుర్తి హవేలీ గ్రామంలోని సరస్వతి శిశు మందిర్‌లో అర్చకుడు భాస్కరాచారి బాలల చేత అక్షరాభ్యాసం చేయించారు. తొలుత సరస్వతి దేవీకి పూజలు నిర్వహించారు.



నెక్కొండ : సరస్వతి దేవికి పూజ చేస్తున్న భక్తులు

ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఖానాపురం : కాంగ్రెస్ ప్రభుత్వం, తాను ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని బుధరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సింహద్వార నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రజలు, భక్తుల కోరిక మేరకు తన సొంత డబ్బుతో ఆలయ సింహద్వార నిర్మాణాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. ఏప్రిల్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఆలయాల అభివృద్ధికి సహకరిస్తానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన పనులు చేపట్టడానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్



పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మి వెంకటనర్సయ్య, డీసీసీ అధికార ప్రతినిధి రవీందర్‌రావు, నాయకులు పెసరు రాణి, ప్రమీల, హేమలత, ఉమాదేవి, చెడిపాక ఉపేందర్, వెంకటనారాయణ, జల్లి మధు, బిక్కి మురళి, చాంద్ పాషా, లాల్ సాహెబ్, మధు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనాభా మేరకు రిజర్వేషన్ కల్పించాలి

- రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి

నల్లబెల్లి : జనాభా మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 56.75 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాలులో ఓదెల రవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి కుమారస్వామి అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుల గణన ఆధారంగా బీసీ జనాభా 56.75 శాతమని ప్రకటించిందని గుర్తు చేశారు. కొన్ని బీసీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కామారెడ్డి డిక్లరేషన్ మేరకు బీసీలకు 42 శాతం



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేయడం సమంజసం కాదన్నారు. అన్ని రంగాల్లోనూ బీసీలకు ఖచ్చితంగా 56.75 శాతం రిజర్వేషన్లు అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సాధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు చీకటి ప్రకాశ్, నాయకులు మేడిపల్లి రాజు, కోల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి

నర్సంపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పర్యావరణ పరిరక్షకులు ప్రకాశ్, బైరు శైలేందర్, స్థానిక బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి ఆకాంక్షించారు. పట్టణంలోని ఆ స్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి వారు సోమవారం రావి, వేప, మామిడి, పారిజాతం, మారేడు, వెలగ మొక్కలు నాటి మాట్లాడారు. నానాటికీ అడవుల శాతం తగ్గిపోతోందని చెప్పారు. పట్టీకరణతో చెట్లు మరింత అంతరిస్తున్నాయని తెలిపారు. అడవుల శాతాన్ని పెంచే దిశగా విద్యార్థులు సైతం మొక్కలు నాటాలని సూచించారు. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బైరు స్వస్తిక్, రాజేశ్వరి, జ్యోతి, రాము, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రకాశ్, విద్యార్థులు

గీత కార్మికుడికి గాయాలు



చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని ఉప్పరపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన మండ నరేందర్ రోజువారీ పనిలో భాగంగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారింది. గాయాలపాలైన నరేందర్‌ను స్థానిక గీత కార్మికులు చికిత్స కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తదనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేందర్‌ను గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు లింగాల వెంకన్న, బీరబోయిన శ్రీనివాస్, మండల ప్రశాంత్, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.